క్లుప్తంగా...

గౌడ సంఘం అధ్యక్షుడిగా అరుణ్



సికింద్రాబాద్: గౌడ సంక్షేమ సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడిగా అరుణ్ కుమార్ గౌడ్ నూతనంగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. కృష్ణకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణ గౌడ్ చేతల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నాడు. అరుణ్ గౌడ్ మాట్లాడుతూ.. గౌడ సంక్షేమం, అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

బౌద్ధనగర్: పేద ప్రజల సంక్షేమానికి నిర్వహించతలపెట్టిన 'ధర్నా' ను విజయవంతం చేయాలని సీపీఐ సనత్‌నగర్ ఇన్‌చార్జి ఉమర్ ఖాన్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేద ప్రజలకు డబుల్ బెడ్రూమ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.గుడిసెవాసులకు పట్టాలతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించి జీవో 58 ప్రకారం ఇళ్ల క్రమబద్ధీకరణ చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం నేడు ఇందిరాపార్క్ వద్ద జరుగనున్న 'ధర్నా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎంపీ నిధులతో పవర్ బోర్



బౌద్ధనగర్: స్థానికంగా నీటి ఎద్దడి సమస్యను తీర్చేందుకు పవర్ బోర్ ఏర్పాటు చేయడం జరిగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ అన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఎంపీ నిధులతో బుధవారం డివిజన్‌లోని న్యూ అశోక్ నగర్ హనుమాన్ దేవాలయం వద్ద పవర్ బోర్ పనులను ప్రారంభించారు. దీని ద్వారా స్థానిక బస్తీల్లో రెండు ట్యాంకులను ఏర్పాటు చేసి నీటి సమస్యను కొంత మేరకు పరిష్కరిస్తామని రవిప్రసాద్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్, కోమరయ్య, సత్యనారాయ, శ్రీధర్, ఓములు, శ్యామ్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జెడ్సీగా రవికిరణ్



సికింద్రాబాద్ : సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా రవికిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఖైరతాబాద్ జెడ్సీగా ఉన్న ఆయన సికింద్రాబాద్‌కు బదిలీపై రాగా, ఇది వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ రెడ్డి శేరిలింగంపల్లికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ చూపుతా అన్నారు. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులను ఎదుర్కొనేందుకు ఇప్పటికి నుంచే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన కోసం ఏర్పాట్లు

లాలాపేట: లాలాపేటలో త్వరలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. బుధవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిలను కలిసి బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహణకు సహకరించాలని నిర్వాహకులు కోరగా దీనికి వారు సానుకూలంగా స్పందించారన్నారు.వంజరి ముత్యాలు, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, మల్లేష్, వేణుగోపాల్‌రెడ్డి,గణేష్, మహేశ్, సాయి, బాలకృష్ణయాదవ్, రమేష్, అశోక్, కిరణ్‌గౌడ్, పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో అధికారుల పర్యటన

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పర్యటించారు. ప్రభుత్వం జారీ చేసిన 58 జీవో కింద ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం అధికారులు ఐడీహెచ్ కాలనీ, భోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఐసీడీఎస్ సికింద్రాబాద్ ప్రాజెక్టు అధికారిణి సునంద, రెవెన్యూ విభాగం రాజులతో పాటు పలువురు ఇంటింటికి వెళ్లి జీవో గురించి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జీవో 58ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి నుంచి జీవనం సాగిస్తున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎల్. వెంకటేషన్, రషీద్ పాల్గొన్నారు.

బోయిగూడలో బీజేపీ నాయకుల పాదయాత్ర

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలో బుధవారం బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, సత్యనారాయణ, శివలింగం, సందీప్ ఆనంద్, ఈశ్వర్, రఘునాథ్, కుమార్, వెంకట్ రాజు, శ్రీకాంత్ పరమేష్ పర్యటించారు. రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోజుల తరబడి నుంచి రోడ్డుపై డ్రైనేజీ పొంగిపొర్లుతూ స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడుతాన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విఫలమయ్యారని ఆరోపించారు.



సారూ.. మాకు డబుల్ ఇళ్లు ఇవ్వరూ!

- 40 ఏళ్లుగా గుడిసెల్లోనే బిక్కుబిక్కుమంటూ జీవనం
- ఎలాంటి సౌకర్యాలకు నోచుకోని మొండి బండానగర్ బస్తీ
- ఆధార్, ఓటర్, రేషన్ కార్డులున్నా నీటి కనెక్షన్లు, విద్యుత్ సౌకర్యం లేదు
- దుర్భర జీవితాన్ని గడుపుతున్న బస్తీ ప్రజలు
- 'డబుల్' ఇళ్లు కేటాయించాలని వేడుకోలు

అడ్డగుట్ట: ఏళ్ల తరబడి మురికికూపంలోనే వీరి జీవితం సాగుతోంది.. వీధి దీపాలే వీరికి ఆధారం.. చిత్తుకాగితాల సేకరణే వీరి జీవనాధారం. ప్రతీరోజు కష్టాలతోనే వీరి దినచర్య మొదలవుతోంది. బతుకుదెరువు కోసం పొట్టచేత పట్టుకొని వివిధ జిల్లాల నుంచి నగరానికి వలస వచ్చిన వీరి తల రాత ఏళ్లు గడుస్తున్నా మారలేదు. 40 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని బతుకుబండిని లాగుతూ చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఓటర్ కార్డు, రేషన్ కార్డ్, ఆధార్‌కార్డులు ఉన్నా కాసింత తలదాచుకునేందుకు గూడు లేకుండా పోయింది. పాలకులు, అధికారులతో మొరపెట్టుకున్నా ప్రతీ నాయకుడు వీళ్లలో ఓట్లనే చూశారు కానీ.. ఎవరూ కూడా వీళ్ల బతుకుల్లోకి తొంగి చూడలేదు. ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ.. గట్టిగా గాలొస్తే కొట్టుకుపోయే గుడిసెల్లో బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. తాగునీటి, విద్యుత్ కనెక్షన్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రెండు మార్లు వచ్చినా వీరి రాత మారనేలేదు. ఇది సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లోని మొండి బండానగర్ బస్తీ పరిస్థితి.

వర్షాకాలంలో జాగరమే..

సుమారు 40 ఏళ్ల క్రితం వివిధ జిల్లాల నుంచి పొట్ట చేతపట్టుకొని నగరానికి వచ్చి అడ్డగుట్టలో గుడిసెలను వేసుకొని బతుకు దెరువు కోసం చిత్తుకాగితాలను ఏరుకుంటూ జీవితాలను సాగిస్తున్నారు. పొద్దున లేచింది మొదలు భుజానికి సంచి తగిలించుకొని వివిధ ప్రాంతాలకు వెళ్లి చిత్తుకాగితాలను ఏరుకోవడం వీరి దినచర్య. నాలుగు దశాబ్దాలుగా తమ బతుకులు ఇలానే ఉంటున్నాయని, వానాకాలమైతే ప్రతీరాత్రి జాగారమే అవుతుందని, అసలే పల్లపు ప్రాంతం కావడంతో నీరంతా గుడిసెల్లోకి రావడంతో రాత్రంతా కంటి మీద కునుకు ఉండదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు డబుల్ బెడ్రూమ్‌లు నిర్మించి ఇవ్వండని ప్రజా ప్రతినిధులను ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కరెంట్, మంచినీటి కనెక్షన్ కూడా లేదని, కనీసం వాటి కోసం ఏ అధికారిని కలవాలో కూడా మాకు తెలియదని చెబుతున్నారు.

నీళ్ల కోసం పక్క బస్తీల్లోకి..

గత పాలకులకు తమ బాధలేమి పట్టలేదని, ఎవరిని కలిసినా ఇదిగో చేస్తాం అదిగో చేస్తాం అని హామీలు గుప్పిస్తున్నారే తప్ప ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదంటున్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ హయాంలోనైనా తమకు డబుల్ బెడ్రూమ్‌లు వస్తాయని కొన్నేళ్లుగా ఆశిస్తూ ఉన్నామని కానీ.. ఒక్క కుటుంబానికి కూడా ఇళ్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి గుడిసెల్లోనే మగ్గుతున్నామని పెద్దసార్లు తమపై దయచూపి మాకు ఇళ్లు నిర్మించి ఇస్తే వారికి జీవితాంతం రుణపడి ఉంటామని మొండిబండా నగర్ వాసులు కోరుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రైతే నరకం అనుభవిస్తున్నామని వీధి దీపాల వెలుగులోనే ఉండాల్సి వస్తుందంటున్నారు. నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో పక్క బస్తీల నుంచి బిందెల్లో నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలప్పుడే మా బస్తీ గుర్తుకొస్తోంది..



నిత్యం అనేక సమస్యల నడుమ కొట్టుమిట్టులాడుతున్నాం. ఏ ప్రభుత్వ హయాంలోనూ మాకు న్యాయం జరగడం లేదు. ఈ సారైనా డబుల్ బెడ్రూమ్ వస్తుందేమోనని ఎంతో ఆశపడ్డాం. ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇల్లు కేటాయించలేదు. అది చేస్తాం ఇది చేస్తామని హామీలు ఇవ్వడమే కాని వాటిని నెరవేర్చడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులకు మొండిబండ నగర్ బస్తీ గుర్తుకు వస్తుంది, ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూస్తే ఒట్టు.

–వీరమ్మ, బస్తీనాయకురాలు

వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం



మొండిబండ నగర్ బస్తీ వాసుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కాని వాళ్లు గుడిసెలు వేసుకొని నివాసముంటున్నది రైల్వే స్థలం కావడంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నాం. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ దృష్టిలో కూడా ఉంది. సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నాం.

–లింగాని ప్రసన్నలక్ష్మి, కార్పొరేటర్

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ దినోత్సవం



బ్యాడ్మింటన్ దినోత్సవంలో పాల్గొన్న షటిల్ రైడర్స్

చిలకలగూడ : సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దినోత్సవాన్ని చిలకలగూడ జీహెచ్ఎంసీ నాగులూరి పార్కులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) ఏర్పడిన 1934 జూలై 5వ తేదీని అంతర్జాతీయ బాడ్మింటన్ దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. చిలకలగూడ, వారాసిగూడ, నామాలగుండు, బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, పద్మారావునగర్, శ్రీనివాసనగర్, మైలార్‌గడ్డ, నామాలగుండు తదితర ప్రాంతాల్లోని క్రీడాకారుల కోసం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి నిధులు కేటాయించిన డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు కృతజ్ఞతలు అన్నారు. నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా సహకారాలతో చిలకలగూడ పార్కులో అవుట్‌డోర్ బాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ అసోషియేషన్ ప్రతినిధులు రాజీవ్, రఘునందన్, జితేంద్ర, అనీల్, శేఖర్, స్వామి, రాంబాబు, లోకేష్‌రెడ్డి, శ్రీనివాస్, బాలరాజ్, సునీత, నస్రీన్, స్వర్ణ, యోగాగురు నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

సత్కారం, వీడ్కోలు



స్వల్పకాలిక విస్తారక్‌లకు జ్ఞాపికలను బహూకరిస్తున్న నాయకులు

సికింద్రాబాద్: తెలంగాణలో బీజేపీ తరపున స్వల్పకాలికంగా విస్తారక్‌లు అందించిన సేవలు, ఇచ్చిన సూచనలు ఎంతో ఉపకరిస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌గౌడ్ పేర్కొన్నారు. 'మేరా బూత్ సబ్సే మజ్బూత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ఆదేశానుసారం మధ్య ప్రదేశ్‌లోని భూపాల్‌లో శిక్షణ తీసుకొని సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్వల్ప కాలికంగా పని చేసేందుకు వచ్చిన విస్తారక్‌లను బుధవారం ఘనంగా సత్కరించారు. విస్తారక్‌గా పని చేసి తిరిగి స్వస్థలాలకు వెళ్తున్న వారికి ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రవిప్రసాద్ గౌడ్, కన్వీనర్ నాగేష్‌రెడ్డి, ప్రభుగుప్తా, పోచయ్య, హనుమంతు, మహేష్, రామువర్మ, దత్తు, ప్రవీణ్ గౌడ్, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రాధాన్యం



'షీ టాక్స్' భేటీలో పాల్గొన్న క్రిశాంక్

కంటోన్మెంట్: మహిళాభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. మూడో వార్డు డబుల్ బెడ్రూమ్ కాలనీలో స్థానిక మహిళలతో 'షీ టాక్స్' పేరిట ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తగిన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలకు ఇచ్చే రుణపరిమితిని పెంచిందన్నారు. మడ్‌ఫోర్ట్ ప్రాంతంలో నివసిస్తూ ఉద్యోగాలు చేసుకునే మహిళలకు తగిన బస్సు సదుపాయం లేదని విన్నవించారు. స్థానిక యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరగా త్వరలో మడ్‌ఫోర్ట్ ప్రాంతంలో ఓ కంప్యూటర్ శిక్షణ కేంద్రం, కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. సువర్ణ, జానకి, మాధవి, సరిత, మేరీ, సంధ్య,ఆషియా, సల్మా బేగం, సమీరా, సహన, పద్మ, కాంచన, చిన్నారి, శ్రీలత పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

లాలాపేట: ట్రాఫిక్ నిబంధనలపై అందరికీ అవగాహన ఉండాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు పేర్కొన్నారు. తార్నాకలోని సరోజిని నాయుడు వనితా ఫార్మసీ మహావిద్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉన్నప్పుడే సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల ప్రాముఖ్యం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలతో కలిగే ప్రమాదాలు, చట్టం ద్వారా వేసే శిక్షలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తిమ్మప్ప, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, ఎస్సైలు వికారుద్దీన్, వీరమ్మ, సుమన్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మమత, ఎగ్జిబిషన్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అదనపు ఎంబీబీఎస్ సీట్లు హర్షణీయం

సికింద్రాబాద్: రాష్ట్రంలో అదనపు ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయమని వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవిప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. కాంపిటేటివ్ అథారిటీ కోటాలో వంద శాతం సీట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు శుభవార్త అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మంత్రి హరీష్‌రావుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ. చంద్రశేఖర్, ముఖ్య సలహాదారులు రాయల సతీష్‌బాబు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

లాలాపేట: ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓయూ స్టూడెంట్స్ ఎజెండా అమలుకు ప్రభుత్వ ముందుకు రావాలన్నారు. యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్, రామకృష్ణ,సుమంత్, స్వాతి తదితరులున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



గీతాదేవి

అడ్డగుట్ట/చిలకలగూడ : వేర్వేరు ఘటనల్లో ఓ గృహిణి, వృద్ధుడు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్, చిలకలగూడ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకున్నాయి. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం .. ఈస్ట్‌మారేడుపల్లిలోని త్రిపుర రాయల్స్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న గీతాదేవి (29) గత నెల 10న బెంగుళూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లి ఈ నెల 3న ఇంటికి వచ్చింది. మరుసటి రోజు రాత్రి 10.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. తన భార్య కనిపించడం లేదని ఆలస్యంగా గమనించిన భర్త గోపాల్ సింగ్, బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మతిస్థిమితం లేని వృద్ధుడు..



అదృశ్యమైన యాదగిరి

చిలకలగూడ ఎస్ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. చిలకలగూడ శ్రీనివాసనగర్‌కు చెందిన యాదగిరి (65) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 4 బయటకు వెళ్లిన యాదగిరి ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుమారుడు బాలరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న మంత్రి

సనత్‌నగర్: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ ఓల్డ్‌కస్టమ్స్ బస్తీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త హరి ఇటీవల మరణించారు. బుధవారం వెస్ట్‌మారేడుపల్లిలోని తన నివాసంలో మంత్రి హరి కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు ఇన్సూరెన్స్ కింద వచ్చే రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీహరి, ఆరీఫ్, నరేష్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జోనల్ కమిషనర్లు

సనత్‌నగర్: సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన రవికిరణ్, ఇటీవల వరకు ఇక్కడ పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. మారేడుపల్లిలోని ఆయన నివాసంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఎల్‌వోసీ అందజేత

రాంగోపాల్‌పేట: రాంగోపాల్‌పేట్ డివిజన్ పాన్‌బజార్‌కు చెందిన పాండురంగారావు మెరుగైన చికిత్స కోసం మంజూరైన రూ.2.5లక్షల ఎల్‌వోసీని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

యూనివర్సిటీ పాలనలో నాయకత్వ శూన్యత

ప్రొ. లింబాద్రి



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొ. లింబాద్రి

లాలాపేట: యూనివర్సిటీల్లోని అకడమిక్ పరిపాలనలో నాయకత్వ శూన్యత ఉందని, రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా యూనివర్సిటీల్లో నాయకత్వం వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఓయూ అధ్యాపకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి అన్నారు. ఓయూలోని హెచ్ఆర్‌డీసీ ఆధ్వర్యంలో గత వారం రోజుల పాటు నిర్వహిస్తున్న 'అకడమిక్ నాయకత్వ శిక్షణ' ముగింపు కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొ. రవీందర్‌తో కలిసి ఆయన పాల్గొన్ని ప్రసంగించారు. ఆచార్యులకు ఈ తరహా నాయకత్వ శిక్షణ ఇవ్వటం రాష్ట్రంలోనే తొలిసారి అని ఆయా విభాగాలకు నాయకత్వం వహించే అధ్యాపకులకు ముక్కుసూటితనం, స్పష్టమైన అవగాహన, పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలకు లోబడి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, రెడ్యానాయక్, హెచ్ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొ. స్మిత, సి.పవార్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌లకు సహకారం అందించాలి



కంటోన్మెంట్: ట్రాన్స్ జెండర్‌ల పట్ల సానుకూల దృక్పథంతో వారిని ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెచ్ఏఎస్ఎస్ఎస్ నిర్వాహకురాలు మాల అన్నారు. రసూల్‌పురాలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్‌ల చేతుల మీదుగా స్థానిక పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్డినల్ పూల ఆంథోనీ ఆదేశాల మేరకు, హెచ్ఏఎస్ఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోని పర్యవేక్షణలో ట్రాన్స్‌జెండర్‌ల పట్ల సమాజంలో నెలకొన్న అసమానతలు తొలగించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ మేరకు మిజిరియోర్ సౌజన్యంతో పేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్‌లను భాగస్వాములను చేశామన్నారు. భవిష్యత్‌లో ట్రాన్స్‌జెండర్‌లకు వృత్తి నైపుణ్యాలు నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. తమ సంస్థ సహకారం పొందాలనుకునే ట్రాన్స్‌జెండర్లు 7729869207 నెంబర్‌కు కాల్ చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో రేఖ, సుధ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు రావాలని ఆహ్వానం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ చరిత్రాత్మకమైన లష్కర్ బోనాలకు రావాలని రేవంత్ రెడ్డిని కోరారు. సనత్‌నగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు నాగేందర్ రాజ్ అధ్వర్యంలో ప్రతినిధి బృంధం బుధవారం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అనిల్‌కుమార్ యాదవ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళి జాతరకు..

రాంగోపాల్‌పేట్: ఈ నెల 9,10వ తేదీల్లో జరుగనున్న ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు రావాలని కోరుతూ పలువురు ప్రముఖులకు దేవాలయం తరుపున ఆహ్వానం పలికారు. బుధవారం ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు, పండితులు, అర్చకులు కలిసి మంత్రి మహమూద్ అలీని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

- బీజేపీ సీనియర్ నాయకులు చీర శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి, తుల ఉమలకు ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఆహ్వాన పత్రికలు అందించారు.
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు ఆహ్వానించారు.

వైజాగ్ టూ ముంబాయి

రైలులో గంజాయి తరలిస్తున్న యువకుడి రిమాండ్



గంజాయితో పట్టుబడ్డ నిందితుడిని చూపిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: రైలులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న యువకుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం .. ఒడిస్సా రాయ్‌గఢ్ ప్రాంతానికి చెందిన జాగ పలక(19) వృత్తిరిత్యా కూలీ పని చేస్తుంటాడు. ఇతను విశాఖపట్నం నుంచి ముంబాయికి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నాడు. బుధవారం రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సందర్భంగా రైలులో ఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దీంతో అనుమానాస్పదంగా కనిపించిన జాగ పలక బ్యాగ్ తనిఖీ చేయగా అందులో గంజాయి కనిపించింది. వెంటనే సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.


బోర్‌వెల్ పనులు ప్రారంభం



బోర్‌వెల్ పనుల ప్రారంభోత్సవంలో శ్యామ్‌కుమార్, లాస్య నందిత, నివేదిత

కంటోన్మెంట్: ఏడోవార్డులో అన్ని బస్తీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని బోర్డు మాజీ సభ్యుడు పి. శ్యామ్‌కుమార్ అన్నారు. ఏడో వార్డు నెహ్రూ సెంటినరీ కాలనీలో బోర్‌వెల్ కోసం దివంగత ఎమ్మెల్యే తన నియోజకవర్గ నిధుల్లో నుంచి రూ.3.5 లక్షలు కేటాయించారు. అందుకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే కుమార్తెలు లాస్య నందిత, నివేదితలతో కలిసి శ్యామ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు అడిగిన వెంటనే దివంగత ఎమ్మెల్యే సాయన్న పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారని అన్నారు. నెహ్రూ సెంటినరీ కాలనీలో ఇప్పటికే ఓ బోర్డు అందుబాటులో ఉన్నప్పటికీ, డిమాండ్ అధికంగా ఉండంతో మరో బోర్‌వెల్ వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో తేజ్‌పాల్, సీనియర్ నేత పనస సంతోష్, వెంకట్, నవీన్, శివ, జోసెఫ్ పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్ కౌన్సిల్ హైదరాబాద్ వైస్‌ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్



చిలకలగూడ: హ్యూమన్‌రైట్ కౌన్సిల్ ఫర్ ఇండియా హైదరాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సీతాఫల్‌మండికి చెందిన వీసం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు హ్యూమన్‌రైట్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని వీసం శ్రీనివాస్ తెలిపారు. ఇటీవటి కాలంలో సైబర్‌క్రైమ్ కేసులు తీవ్రమయ్యాయని, విద్యాధికులతో పాటు నిరక్షరాస్యులు నేరగాళ్ల చేతికి చిక్కి రూ. లక్షలు నష్టపోవడంతోపాటు మానసిక ఆందోళనకు గురవుతున్నారని, సైబర్ క్రైంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు.

కల్చర్ టెక్నాలజీపై ముగిసిన వర్క్‌షాప్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ సెంట్రల్ ఫెసిలిటీ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో జూలై 3న ప్రారంభమైన సెల్ కల్చర్ టెక్నాలజీపై మూడు రోజుల వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా వీసీ ఓఎస్‌డీ ప్రొ. రెడ్యానాయక్ హాజరై ప్రసంగించారు. అత్యాధునిక పరిశోధనలో సెల్ కల్చర్ టెక్నాలజీ ప్రాముఖ్యత, ప్రపంచస్థాయి పరిశోధనలకు సిద్ధం చేయడంలో ఇలాంటి వర్క్‌షాప్‌ల ప్రాముఖ్యతను వివరించారు. ప్రొఫెసర్లు వీరయ్య, స్టీవెన్సన్, పీహెచ్‌డీ విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో ఎట్టకేలకు తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయి. గత కొంత కాలంగా మంచీనిటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అసోసియేషన్ నాయకులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా కొత్త పైప్‌లైన్ కోసం రూ.10 లక్షలు మంజూరు చేశారని అసోసియేషన్ అధ్యక్షులు హరిసింగ్ తెలిపారు.